క్లుప్తంగా

కలువ పూల అలంకారం



కలువ పూల అలంకరణలో రతనాల వేంకటేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాత మార్కెట్‌లోని శ్రీలలితా దేవి, రతనాల వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం స్వామి వారికి విశేష పూజాకార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున రతనాల వేంకటేశ్వర స్వామికి, స్వామివారి చెల్లెలు లలితాదేవికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేంగా అలంకరణ చేశారు. స్వామివారికి విశేషంగా 1008 కలువ పూలతో అలంకరించారు. అలాగే శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు విశేష పూజలను నిర్వహించారు.

పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో బుధవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. బాలాజీనగర్–1 మోటు వద్ద ఉన్న చెత్తపాయింట్‌ను కార్మికులతో శుభ్రం చేయించారు. రామేశ్వరం రోడ్డులోని డివైడర్లలో ఉన్న చెట్లకు నీరు పట్టే పనులను కమిషనర్ పర్యవేక్షించారు. మిట్టమడి వీధిలో చెత్తపాయింట్‌ను తొలగించాలని అక్కడ ప్రజలు కమిషనర్‌కు తెలపగా అక్కడ చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గోవిందరెడ్డి, నూర్ బాషా పాల్గొన్నారు.

గోడౌన్ తనిఖీ



పౌరసరఫరాల శాఖ గోడౌన్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ సాయిశ్రీ

ప్రొద్దుటూరు : స్థానిక జమ్మలమడుగు రోడ్డులో ఉన్న పౌరసరఫరాల శాఖ గోడౌన్‌ను జమ్మలమడుగు ఆర్డీఓ ఆదిమూలం సాయిశ్రీ బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. బియ్యం, చెక్కరతోపాటు నిత్యావసర వస్తువుల స్టాక్‌ను పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. ప్రజలకు ప్రతినెలా గడువులోగా నిత్యావసర సరుకులను అందించాలని తెలిపారు. ఆర్డీఓ వెంట డిప్యూటీ తహసీల్దార్‌లు సాయినాథ్‌రెడ్డి, మల్లికార్జున, ఆర్ఐ నాగమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సరుకులు పంపిణీ



నిత్యావసర సరుకులు అందిస్తున్న విజయభాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులు

ప్రొద్దుటూరు : మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బండి విజయభాస్కర్‌రెడ్డి జ్ఞాపకార్థం మండలంలోని పెద్దశెట్టిపల్లె పంచాయతీ శంకరాపురం గ్రామంలో బుధవారం 100 కుటుంబాలకు నిత్యావసర సరుకులు ఆయన కుటుంబ సభ్యులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి కుమారులు కుమారస్వామి రెడ్డి, సానా రెడ్డి, బాలసుబ్బారెడ్డి, బంధువులు, అభిమానులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

అట్లూరు : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మండల పరిధిలోని కడప–బద్వేలు ప్రధాన రహదారిపై బుధవారం రెడ్డిపల్లె క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించి రికార్డులు లేని 12 వాహనాలకు సంబంధించి రూ.4020లు జరిమానా విధించారు.

మిర్చి రైతులకు నష్టాల ఘాటు



పాపిరెడ్డిపల్లెలో కల్లంలో ఆరబోసిన మిర్చి



బాలరాజుపల్లెలో తెగులు సోకిన మిర్చి పంట

- వైరస్ తెగులుతో తగ్గిన దిగుబడులు
- ధర కూడా అంతంత మాత్రమే
- ఎకరానికి రూ.లక్ష పెట్టుబడి
- ఆందోళనలో రైతులు

కాశినాయన : మంచి లాభాలు వస్తాయని ఆశించి మిర్చి పంట సాగు చేసిన రైతులు ఒకవైపు తెగుళ్ళు మరోవైపు ధర లేక నష్టాలు చవిచూస్తున్నారు. దీంతో మిర్చి రైతు కుదేలయ్యారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది మిర్చి పంటకు అధికంగా తెగుళ్ళు సోకాయి. ఎన్నిరకాల పురుగు మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. దీంతో పంట పూర్తిగా దెబ్బతింది. గతంతో పోలిస్తే దిగుబడి 60 శాతం తగ్గిందని రైతులు అంటున్నారు. మరోవైపు మిర్చి ధరలు పూర్తిగా పడిపోయాయి. గతేడాదితో పోలిస్తే సగాని కంటే తక్కువగా ధరలు తగ్గాయి. దీంతో పెట్టుబడి సంగతి దేవుడెరుగు కూలీల ఖర్చులు కూడా రావడం లేదని రైతులు లబోదిబోమంటున్నారు.

ఎకరానికి రూ.లక్ష పెట్టుబడి

ఎకరా మిర్చిపంట సాగుకు రూ.లక్ష పెట్టుబడి పెట్టారు. రూ.50 వేలు పురుగు మందులకు, రసాయనిక ఎరువులు, నారు, సేద్యం, కూలీ ఖర్చులు మరో రూ.50 వేల వరకు రైతులు పెట్టుబడి పెట్టారు. కాయ కోత కూలీ, ఆరబెట్టడం, గ్రేడింగ్ ఖర్చులకు మరో రూ.5 వేలు అవుతుంది. ఈ లెక్కన ఎకరానికి పెట్టుబడి రూ.లక్షకు తగ్గకుండా అవుతుందని రైతులు అంటున్నారు.

పడిపోయిన ధరలు

గతంలో ఎకరానికి 30 క్వింటాళ్ళు తగ్గకుండా దిగుబడి వచ్చేది. ఈ ఏడాది తెగుళ్ళ ఉధృతికి ఎకరానికి 5 నుంచి 10 క్వింటాళ్ళ దిగుబడికి మించి రాదని రైతులు అంటున్నారు. ఈ ఏడాది ధరలు మరింత పతమయ్యాయి. ప్రారంభంలో మిర్చి క్వింటా రూ.15 వేలు పలికింది. ప్రస్తుతం రూ.12 వేలకు పడిపోయింది. గతేడాది నాటురకం మిర్చి క్వింటా రూ.25 వేలు ఉండగా ఈ ఏడాది రూ.10 వేలకు మించలేదు. తేజ రకం గతేడాది రూ.22 వేల నుంచి రూ.24 వేలు అమ్మగా ఈ ఏడాది రూ.12 వేలకు మించి లేదు. తెగుళ్ళ వలన దిగుబడి తగ్గింది.

సగానికి తగ్గిన సాగు

ప్రతి ఏటా తెగుళ్ళు అధికం కావడంతో మండలంలో మిర్చి సాగు సగానికి తగ్గింది. మండలంలోని పాపిరెడ్డిపల్లె, బాలరాజుపల్లె, వడ్డమాను గ్రామాల్లో అధికంగా మిరపను సాగు చేస్తారు. గతేడాది వెయ్యి ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేయగా ఈ ఏడాది 570 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. మిర్చి రైతులు నష్టాన్ని చవిచూస్తున్నారు. కొంత మంది రైతులు గతేడాది పంటను కోల్డ్‌స్టోరేజీలో నిల్వ ఉంచారు. ధరలు పతకం కావడంతో నష్టపోయారు. అంతర్జాతీయ మార్కెట్‌లో మిర్చికి డిమాండ్ తగ్గడంతో ఎగుమతులు లేక ధరలు తగ్గాయని వ్యాపారులు అంటున్నారు.

దిగుబడి తగ్గింది

రెండు ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశాను. రూ.2 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టాను. గతేడాది దిగుబడి బాగానే వచ్చింది. ఈ ఏడాది తెగుళ్ళు, అకాల వర్షాలతో దిగుబడి తగ్గింది. ధర కూడా అంతంత మాత్రమే ఉంది.

– గురయ్య, రైతు, పాపిరెడ్డిపల్లె, కాశినాయన మండలం

పేదలకు భూమిని మంజూరు చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి

మైదుకూరు : భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వం వెంటనే హెక్టారు భూమిని మంజూరు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మైదుకూరులో సీపీఐ భూ సదస్సును నిర్వహించింది. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి షావలి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్.నాగసుబ్బారెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి పి.శ్రీరాములు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఏవీ శివరామ్ మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలాన్ని మంజూరు చేయాలని తెలిపారు. భూమిలేని పేదలకు ఒక హెక్టారు వ్యవసాయ భూమిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 మాసాలు అవుతున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకపోవడం శోచనీయమని విమర్శించారు. గతంలో మైదుకూరు రెవెన్యూ అధికారులకు ఎన్ని వినతి పత్రాలు సమర్పించినా ఫలితం శూన్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పేదలకు ఇంటికి స్థలాలను, వ్యవసాయ భూమిని ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ స్థలాలను గుర్తించి అర్హులైన పేదలకు పంచి పెడతామని వారు హెచ్చరించారు. క్యాక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బీవీ శ్రీనివాసులు, బాల సుబ్బయ్య, సుబ్బరాయుడు, భవన నిర్మాణ సంఘం నాయకులు పీరయ్య పాల్గొన్నారు.

కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను ఖండించండి



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

బద్వేలు అర్బన్ : రాష్ట్ర ప్రజల ఆశలను అడియాశలు చేసిన కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను ప్రతిఒక్కరు ఖండించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.నాగేంద్రబాబు తెలిపారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మికులకు, కర్షకులకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ బుధవారం స్థానిక మైదుకూరు రోడ్డులోని పోస్టల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వేతన ఉద్యోగులు, స్వయం ఉపాధిలో ఉన్న కార్మికుల ఆదాయ, స్థితిగతులను పూర్తిగా విస్మరించి కార్పొరేట్ వర్గాలకు లాభాలు చేకూర్చే విధంగా ఉందన్నారు. గత సంవత్సరం 4.9 శాతంగా ఉన్న బడ్జెట్ లోటును 4.4 శాతానికి తగ్గించడమే లక్ష్యంగా పెట్టుకోవడం వలన ప్రజల సంక్షేమానికి కేటాయింపులు మరింత తగ్గాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ విధానాలను మానుకుని కార్మికుల హక్కులు కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల, విభాగాల నాయకులు పాల్గొన్నారు.

టీ.సండ్రపల్లెలో పొలం పిలుస్తోంది



టీ.సండ్రపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారులు

గోపవరం : మండలంలోని టీ.సండ్రపల్లెలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారులు నిర్వహించారు. ముందుగా ఇన్‌చార్జి ఏఓ మాధురి గ్రామసభ ఏర్పాటు చేసి రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వివరించారు. ప్రస్తుతం సాగైన వేరుశనగ, వరి, కూరగాయల పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. జీవ నియంత్రణ తెగుళ్ళ మందుల వినియోగం, జీవన ఎరువులు, విత్తనాలు కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం వరిపంటను పరిశీలించి వ్యాపించే తెగుళ్ళ పట్ల రైతులకు అప్రమత్తంగా ఉండాలన్నారు. డ్రోన్ టెక్నాలజీ వంటి అధునాతన పద్ధతులపై రైతులతో చర్చించారు. పంటల సాగు తదితర అంశాలపై రైతులకు వ్యవసాయ సిబ్బంది స్థానిక రైతుసేవా కేంద్రంలో అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఓబయ్య, వీఏఏ బాదుల్లా, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



కోనేరులో చేపలు వదులుతున్న డాక్టర్ హనీఫ్‌బాబా



గంబూసియా చేపలు వదులుతున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి, వైద్య సిబ్బంది

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని కాకిరేనిపల్లె, నరసింహాపురం, గోపవరం, కామనూరు, చెన్నమరాజుపల్లె, అమృతానగర్‌లలో బుధవారం దోమల నివారణకు వైద్యాధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా దోమలు వృద్ధి చెందకుండా లార్వా దశలోనే నిర్మూలించుటకు కుంటలలో, కోనేరులలో, మురికి కాలువలలో గంబూజియా చేపలను వదిలారు. వైద్యాధికారి డాక్టర్ హనీఫ్‌బాబా, మలేరియా సబ్ యూనిట్ ఇన్‌చార్జి అధికారి మురళీధర్, హెల్త్ సూపర్‌వైజర్లు బీఏ వరప్రసాద్, మాధవరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, సీహెచ్ఓ మెర్సీ, ఆరోగ్య కార్యకర్త యశోద తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్ : బద్వేలు, పోరుమామిళ్ల ప్రాంతాలలోని పలు చోట్ల దోమల నివారణ చర్యల్లో భాగంగా బుధవారం మంచినీటి కుంటల్లో గంబూసియా చేపలు వదిలారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి టి.నరసింహారెడ్డి మాట్లాడుతూ మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులకు మూలకారణమైన దోమలను అరికట్టేందుకు ప్రతిఒక్కరు దోమల నివారణ చర్యలు పాటించాలని కోరారు. గంబూసియా చేపల ద్వారా మంచినీటి కుంటల్లో పెరిగే దోమల లార్వాలను నశింపజేయవచ్చని అన్నారు. ప్రజలు కూడా బాధ్యతగా వారంలో ఒక రోజు డ్రైడే పాటించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు బి.మఠంలో వేలం పాట

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిమఠంలో గురువారం ఉదయం 10గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మేనేజర్ ఈశ్వరాచారి తెలిపారు. ఇందులో భక్తుల సమర్పించే తల వెంట్రుకల వసూలుకు రూ.25 లక్షలు డిపాజిట్ చెల్లించాలి. పోలేరమ్మ వద్ద టెంకాల విక్రయానికి రూ. లక్ష , పోలేరమ్మ వద్ద కొబ్బరి ముక్కల వసూలకు రూ.75 వేలు, మరుగుదొడ్ల నిర్వహణకు రూ.75వేలు, మరో చోట నిర్వహణకు రూ.50వేలు, పాదరక్షల భద్రపరచుటకు రూ.50వేలు, డార్మెంటరీ నిర్వహణకు లక్ష చెల్లించాల్సి ఉంటుంది. పుస్తకాల విక్రయానికి లక్ష, టీటీడీ సత్రంలో మరుగుదొడ్ల నిర్వహణకు రూ.50 వేలు చొప్పున నగదు లేదా డీడీ రూపాన చెల్లించి బహిరంగ వేలం పాటలో పాల్గొనాలన్నారు. పాట పూర్తయిన తర్వాత హక్కుదారుడు రెండు భాగాల మొత్తాన్ని అక్కడే చెల్లించాలని తెలిపారు.

రైతు సేవా కేంద్రాలను వినియోగించుకోవాలి

చాపాడు : గ్రామా సచివాలయాల పరిధిలో నిర్మితమైన రైతు సేవా కేంద్రాల సేవలను రైతులు వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి మ్యాగీ అన్నారు. మండలంలోని లక్ష్మీపేట గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. రబీలో రైతులు సాగుచేసుకున్న పంటలకు ఈ క్రాప్ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని సూచించారు. పంటలు సాగు చేసేక్రమంలో వ్యవసాయ సిబ్బంది సంప్రదించి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు సుప్రియ, లత తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

ప్రొద్దుటూరు : ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు వై.హరి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ గంగయ్యకు ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాల నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేట్ పరం చేయవద్దని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. మున్సిపల్ వర్కర్స్ పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్ క్లెయిమ్స్ క్లియర్ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి మధు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు ఏసోబు పాల్గొన్నారు.

నేటి నుంచి రామాలయ ప్రతిష్ట వేడుకలు

చాపాడు : మండలం పరిధిలోని నక్కలదిన్నె గ్రామంలో పునర్నిర్మితమైన రామాలయ ప్రతిష్ట వేడుకలు గురువారం నుంచి ఘనంగా నిర్వహించనున్నారు. వేడుకలలో భాగంగా 6, 7, 8వ తేదీలలో శ్రీ సీతారామలక్ష్మణ సమేత హనుమత్ విగ్రహ, శిఖర, ధ్వజ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. గత ఏడాది దేవదాయ శాఖ రూ.30లక్షలు మంజూరు చేయగా, శెట్టిపల్లె కుటుంబీకులు, ప్రజల సహకారంతో మరో రూ.35 లక్షలు సమకూరగా ఆలయ నిర్మాణం పూర్తి చేశారు. ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి కుటుంబీకులు, సీఏడీఏ కమిషనర్ శెట్టిపల్లె రాంసుందర్‌రెడ్డి కుటుంబీకులు హాజరుకానున్నారు.

లేబర్‌కోడ్స్ ఎత్తివేయాలని ధర్నా

పోరుమామిళ్ల : ఎన్నో ఏళ్లుగా ఉన్న 44 చట్టాలను నాలుగు కోడ్స్‌గా మార్చి కార్మికులపై ఉక్కుపాదం మోపడం బీజేపీ దుర్మార్గమైన పాలనకు నిదర్శనమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్ తెలిపారు. బుధవారం అంబేడ్కర్ సర్కిల్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు లేబర్‌కోడ్స్ ఎత్తివేయాలని ధర్నా చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు

గోపవరం : మడకలవారిపల్లె రెవెన్యూ పరిధిలోని దాదాపు 40కు పైగా సర్వేనెంబర్లలో పబ్లిక్ పర్పస్, రస్తా పోరంబోకులు ఆక్రమణకు గురయ్యాయని, వీటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని బుధవారం సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ బద్వేలు మున్సిపల్ అధికారులు, గోపవరం రెవెన్యూ అధికారులు భూ ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్నారని చెబుతున్నారే తప్ప ఎక్కడా కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని ఆరోపించారు. ఆయా సర్వేనెంబర్ల పరిధిలో ఆక్రమణకు గురైన పబ్లిక్ పర్పస్, రస్తా పోరంబోకులకు సంబంధించి పూర్తిస్థాయిలో వివరాలు అందజేస్తామని, ధైర్యం ఉంటే ఆక్రమణలను తొలగిస్తారని అని ప్రశ్నించారు. కొంత మంది రెవెన్యూ సిబ్బందే ఆక్రమణలకు పరోక్షంగా సహకరిస్తున్నారని, ఈ విషయం అధికారులకు కూడా తెలుసని ఆయన అన్నారు. రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న బద్వేలు మున్సిపాలిటీలో అనేక ప్రజావసరాలైన పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర వాటి కోసం గతంలో పబ్లిక్ పర్పస్ కోసం స్థలాలు కేటాయించారని, అవి పూర్తిస్థాయిలో ఆక్రమణకు గురైనట్లు ఆయన తెలిపారు. వెంటనే ఆక్రమణలను తొలగించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, నిర్మాణాలకు సహకరించిన రెవెన్యూ, మున్సిపల్ అధికారులను తక్షణమే విధుల నుంచి తొలగించి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు చంద్రమోహన్‌రాజు, జకరయ్య, నియోజకవర్గ నాయకులు రామరాజు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

బాలగురయ్యకుంటను పరిశీలించిన ఆర్డీఓ



బాలగురయ్యకుంటకు సంబంధించిన భూమిని పరిశీలిస్తున్న ఆర్డీఓ చంద్రమోహన్

బి.కోడూరు : మండలంలోని ఐత్రంపేట గ్రామ పొలంలోని సర్వే నెంబర్ 2735, 2736, బాలగురయ్యకుంటకు సంబంధించిన సర్వే నెంబర్ 1635 భూములను కూటమి ప్రభుత్వ నాయకులు ఆక్రమించిన నేపథ్యంలో బుధవారం ఆర్డీఓ చంద్రమోహన్ ఆక్రమణకు గురైన భూములను పరిశీలించి రికార్డులను పరిశీలించారు. బాలగురయ్యకుంటకు సంబంధించిన భూమిని మాజీ ఎమ్మెల్యే జయరాములు చదును చేసి చెట్లు నాటి సాగు చేసుకుంటున్నారని కొంత మంది నాయకులు ఫిర్యాదు చేయడంతో ఆయన స్వయంగా సర్వేయర్ రక్షిత, వీఆర్ఓ ప్రవీణ్, రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆక్రమణ భూముల వద్దకు వెళ్లి పరిశీలించడంతో పాటు వెంటనే సర్వే చేయించి పొలాల హద్దులను ఏర్పాటు చేసి నివేదికలు పంపాలని ఆదేశించారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన అవసరం



సైబర్ నేరాల నియంత్రణ పోస్టర్ల ఆవిష్కరణ

ఖాజీపేట : నేటి సమాజంలో డిజిటల్ విప్లవం నడుస్తోంది.. సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన ఎంతో అవసరమని ఏపీ మాడల్ స్కూల్ ప్రిన్స్‌పల్ విజయనరసింహ అన్నారు. హెల్త్ ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏపీ మోడల్ స్కూల్లో సైబర్ నేరాల నియంత్రణపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు ఆర్థిక అక్షరాస్యత విద్యార్థులకు అవసరం అన్నారు. అందరూ స్మార్ట్‌ఫోన్లు వాడుతున్నారన్నారు. వ్యక్తిగత సమాచారం ఎవ్వరికి చెప్పవద్దన్నారు. బ్యాంకు లావాదేవీలకు సంబంధించి ఓటీపీలు ఎవ్వరికి చెప్పనవసరం లేదని సూచించారు. కెనరా బ్యాంక్ రిటైర్డ్ సీనియర్ మేనేజర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీలు జరిపేటప్పుడు చాలా లింకులు వస్తున్నాయన్నారు. వాటిని ఉపయోగించుకునే సమయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెడ్స్ సంస్థ కోఆర్డినేటర్ ఉదమ్‌కుమార్, అధ్యపక బృందం పాల్గొన్నారు.

బెల్టుషాపులపై వెంటనే చర్యలు తీసుకోండి

బి.కోడూరు : మండలంలో విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన బెల్టుషాపులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు నరసింహులు తెలిపారు.

బుధవారం మండలంలోని బి.కోడూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో పంచాయతీకి నాలుగు చొప్పున సుమారు 40కు పైగా బెల్టుషాపులను ఏర్పాటు చేసి మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని, దీనిమూలంగా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు మద్యానికి బానిసై ఆర్థికంగా, ఆరోగ్యంగా చిన్నాభిన్నమవుతున్నారని తెలిపారు. బెల్టుషాపుల కారణంగా గ్రామాల్లో ఘర్షణలు కూడా చోటు చేసుకుంటున్నాయని, కూటమి ప్రభుత్వం ఒక పక్క బెల్టుషాపులు నిర్వహిస్తే బెల్టు తీస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్నా స్థానికంగా మద్యంషాపు నిర్వహిస్తున్న యజమానులు గ్రామాల్లో గుడులు, బడులను వదలకుండా బెల్టుషాపులు నిర్వహిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేమిటని అన్నారు. వెంటనే బెల్టుషాపులపై దాడులు నిర్వహించి అందుకు బాధ్యులైన వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పశువైద్య విద్యార్థుల ర్యాలీ



పుటపర్తి సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న పశువైద్య విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్ : స్టైఫండ్‌ను పెంచాలని గోపవరం గ్రామ సమీపంలోని పశువైద్య కళాశాల విద్యార్థులు మూడో రోజు నిరసనలో భాగంగా బుధవారం స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఎస్ఎస్ మాల్ వద్ద నుంచి పుట్టపర్తి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్య కళాశాల నాలుగో సంవత్సరం విద్యార్థులు రాహుల్, శివతరుణ్ మాట్లాడుతూ పశువైద్య విద్యార్థుల స్టైఫండ్ పెంచి తమ సమస్యను పరిష్కరించే వరకు ఆందోళనలు, నిరసనలు ఆగవన్నారు. ఎంబీబీఎస్ మెడికల్ విద్యార్థులకు సమానంగా పశువైద్య కళాశాల విద్యార్థులకు కూడా రూ.25,900 స్టైఫండ్ పెంచాలన్నారు. 2013 నుండి ఇప్పటి వరకు తమ స్టైఫండ్ కేవలం రూ.7వేలు మాత్రమే ప్రభుత్వం ఇస్తోందన్నారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 300 మంది పశువైద్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లకు విచారణ అధికారుల నియామకం

బద్వేలు అర్బన్ : బద్వేలు నియోజకవర్గంలోని పలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు జిల్లా కలెక్టర్, జిల్లా సహకారశాఖాధికారి ఉత్తర్వుల మేరకు బుధవారం 5 మందిని విచారణ అధికారులుగా నియమించారు. ఇందులో చిన్నకేశంపల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి ఎస్.నాగముని (సెల్ నెం. 7780396561), బ్రాహ్మణపల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి ఎస్.కె.రహమత్‌అలీ (సెల్ నెం. 7893130741), బి.కోడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి కె.ఆనంద్‌కుమార్ (సెల్ నెం. 9849574212), నరసాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి పి.వెంకటరమణ (సెల్ నెం. 9618611747), కొత్తకోట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి డి.ఈశ్వరయ్య (సెల్ నెం. 9966060594)లను నియమించారు. ఆయా సంఘాలలో గడిచిన పది సంవత్సరాల్లో రుణాలు పొందిన రైతులు, సభ్యులు సంబంధిత విచారణ అధికారి వద్దకు వచ్చి ఏవైనా అభిప్రాయాలు ఉంటే తెలపవచ్చని తెలిపారు.

పరీక్షల విధులకు అవకాశం కల్పించాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా త్వరలో జరగబోతున్న ఇంటర్ ప్రాక్టికల్, థియరీ పరీక్షల విధులకు హైస్కూల్ ప్లస్‌లో పనిచేస్తున్న తమకు అవకాశం కల్పించాలని జిల్లా పీజీటీ సంఘం నాయకులు విన్నవించారు. ఈ మేరకు బుధవారం ఇంటర్ ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్యను కలిసి తమ సంఘం తరుపున వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ చెరుకూరు శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు ఆవుల వెంకటేలు మాట్లాడుతూ హైస్కూల్ ప్లస్‌లో పనిచేస్తున్న అధ్యాపకులకు డిపార్ట్‌మెంట్, స్క్వాడ్ డ్యూటీతోపాటు పరీక్షల అనంతరం స్పాట్ వాల్యూయేషన్ డ్యూటీలకు అవకాశం కల్పించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పీజీటీ సంఘం జిల్లా సెక్రటరీ సురేష్‌కుమార్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు అవారు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బలిజలకు రిజర్వేషన్లు కల్పించాలి

కడప రూరల్ : సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు బలిజ, కాపు, వెలగ, ఒంటరి ఉప కులాలకు 5 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని రాయలసీమ బలిజ సంఘం ఐక్య పోరాట సమితి అధ్యక్షులు ఎస్వీ రాము తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు బలిజలకు 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ఆ మేరకు ఒక కమిటీ ద్వారా అమలు కోసం నివేదికను కేంద్రానికి పంపారని తెలిపారు. ఇందుకు బదులుగా అప్పటి కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్ల అమలు రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోనే ఉంటుందని చెప్పిందన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నారని, ఆయన ఇచ్చిన హామీని అమలు చేయాల్సిన బాధ్యత ఆయనపైనే ఉందన్నారు. తక్షణం 5 శాతం రిజర్వేషన్లు కల్పించి బలిజ వర్గాలకు న్యాయం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జే. భాస్కర్, రామా శ్రీనివాసులు, ఆరె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.